ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
గురువారం 31 అక్టోబరు 2024

ఆటో-బైక్ ఢీ.. ఇద్దరి దుర్మరణం

● మృతుల్లో బాలుడు



ఢీకొన్న ఆటో-మోటర్ బైక్

బషీరాబాద్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో బాలుడు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో వ్యక్తి ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయిన సంఘటన కాశీంపూర్ వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుల ప్రకారం... మండలంలోని నంద్యానాయక్‌తండాకు చెందిన మోహన్(33), అతడి సమీప బంధువు రాంచరణ్(14), సునీల్‌లు కలిసి బైక్‌పై తాండూరు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. కాశీంపూర్ గేటు వద్దకు రాగానే కర్ణాటక కిష్టాపూర్ భైరంపల్లి తండాకు చెందిన సంతోష్ ఆటో.. వీరి బైక్ ఢీకొట్టుకున్నాయి. దీంతో బైక్‌పై రాంచరణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మోహన్, మరో బాలుడు సునిల్, ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సకాలంలో అంబులెన్స్ రాకపోవడంతో వారిని బైక్‌పై తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న మోహన్‌ను హైదరాబాద్ తరలిస్తుండగా మృతి చెందాడు. ప్రమాదంపై పోలీసులకు తెలిపినా సకాలంలో స్పందించలేదని మృతుల కుటుంబీకులు విలపించారు. కుటుంబీకులే రాంచరణ్ మృతదేహాన్ని, గాయపడిన సునిల్‌ను బైక్‌పై ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ సంతోష్‌ను కర్ణాటక ప్రాంత ఆసుపత్రికి చేర్చారు. ఎస్‌ఐ గప్పార్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేశారు. కాగా రాంచరణ్ నవాల్గ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ ఘటన విషయం తెలుసుకున్న ఏఎంసీ వైస్‌చైర్మన్ చందర్ ఆస్పత్రికి చేరుకొని మృతుల కుటుంబాలను ఓదార్చారు.



మోహన్, రాంచరణ్(ఫైల్)

అక్రమంగా కలప రవాణా చేస్తున్న డీసీఎం పట్టివేత

తాండూరు రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అక్రమంగా కలప రవాణా చేస్తున్న డీసీఎం(టీఎస్34టీ1246)ను మంగళవారం రాత్రి గౌతాపూర్‌శివారులో పోలీసుల పట్టుకున్నారు. కలప రవాణాకు అనుమతి పత్రాలు లేకపోవడంతో పోలీసులు వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని ఫారెస్ట్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపారు.

కర్ణాటక రాష్ట్ర డీజిల్ స్వాధీనం

తాండూరు రూరల్, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి బొలెరో వాహనంలో డీజిల్‌ను అక్రమంగా తరలిస్తుండగా బుధవారం పోలీసులు పట్టుకున్నారు. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక నుంచిబొలెరో(టీఎస్07యూకే8505)లో డ్రమ్ముల్లో డీజిల్‌ను హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. బెల్కటూర్ వద్ద వాహనాన్ని పట్టుకున్నారు. డ్రమ్ముల్లో 800లీటర్ల డీజిల్‌ను గుర్తించారు. వాహనాన్ని స్టేషన్‌ను తరలించి డ్రైవర్ కామేష్‌రావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. తెలంగాణలో కంటే కర్ణాటకలో డీజిల్, పెట్రోల్ తక్కువ రేటుకు లభిస్తుండడంతో అక్కడి నుంచి తెచ్చి ఇక్కడ అధిక ధరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కీసర, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతీ ధాన్యంగింజను కొనుగోలు చేస్తామని కీసర సహకార సంఘం చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్నిప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు సకాలంలో రైతుల బ్యాంక్‌ఖాతాలో జమ చేసే విధంగా చర్యలు తీసకుంటామని తెలిపారు. వెంకట్‌రెడ్డి, సుగుణభాయ్, మాధవీలత, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.



వెలుగుల సంబురం

- దీపాల కాంతుల్లో మెరుస్తున్న లోగిళ్లు
- పూల అలంకరణలో ముస్తాబైన ఇళ్లు
- లక్ష్మీపూజ, నోములు, వ్రతాలకు సర్వం సిద్ధం
- బంధుమిత్రులతో కళకళలాడుతున్న పల్లెలు

దీపావళి పర్వదినాన తెలుగింటి లోగిళ్లు కళకళలాడుతున్నాయి. దివ్వెల అలంకరణతో ఇళ్లన్నీ మిరుమిట్లుగొలుపుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎటు చూసినా రంగురంగుల పూల తోరణాలు దర్శనమిస్తున్నాయి. బంధుమిత్రులతో పల్లెలు, పట్నం అనే తేడా లేకుండా నిండుగా కనిపిస్తున్నాయి. గురు, శుక్రవారాల్లో లక్ష్మీపూజ, వ్రతాలు, నోములు నిర్వహించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. పండగను సంబురంగా జరుపుకునేందుకు భారీగా టపాసుల కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇప్పటికే క్రాకర్స్ మెరుపులు, టపాసుల మోతలు వినిపిస్తున్నాయి. కాగా, కొనుగోలుదారులతో బుధవారం మార్కెట్లు, దుకాణసముదాయాలు కిక్కిరిసాయి. మహిళలు పూలు, ప్రమిదల, పూజా సామగ్రిని పెద్ద మొత్తంలో కొనుగోలు చేశారు. ఉద్యోగ, వ్యాపార నిమిత్తం వివిధ ప్రాంతాల్లో నివాసముండే వారంతా పిల్లాపాపలతో స్వగ్రామాలకు చేరుకుంటున్నారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, అక్టోబరు 30


పూలు కొనగోలు చేస్తున్న మహిళలు

అరటి బోదెలకు భలే గిరాకీ

మర్పల్లి: దీపావళి పండగ సందర్భంగా అరటి బోదెలకు భలే గిరాకీ ఉంది. లక్ష్మీపూజలో విధిగా ఉపయోగిస్తుండటంతో డిమాండ్ పెరిగింది. దీంతో రైతులు అరటి చెట్లతో పాటు పిల్లమొక్కలను కోసి నగరానికి తరలిస్తున్నారు. ఒక్కో బోదెకు రూ.100 చొప్పున విక్రయిస్తున్నట్లు రైతులు తెలిపారు. మర్పల్లి మండలంలోని బూచన్‌పల్లి, దామస్తాపూర్, కొంశెట్టిపల్లి, పట్లూర్ తదితర గ్రామాల నుంచి అరటి బోదెలను హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.

అందరి జీవితాల్లో వెలుగులు నిండాలి

- అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



వికారాబాద్ (ఆంధ్రజ్యోతి) : చిరు దివ్వెలతో చీకట్లను పారదోలేది దీపావళి అని, ఈ పండగ ప్రతీ ఒక్కరి జీవితంలో వెలుగులను నింపాలని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆకాంక్షించారు. పేదలు, రైతుల జీవితాల్లో వెలుగులు నింపడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తగు జాగ్రత్తలతో కుటుంబ సభ్యులందరూ కలిసి ఆనందోత్సహాల నడుమ దీపావళిని జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

కుండపోత

- రెండు గంటలు ఏకధాటిగా కురిసిన వర్షం
- రోడ్లపై భారీగా ప్రవహించిన వరద నీరు
- చిరువ్యాపారుల ఇబ్బందులు


వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో నిలిచిన వర్షపునీరు

వికారాబాద్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ పట్టణంలో వర్షం అలజడి సృష్టించింది. బుధవారం సాయంత్రం మేఘావృతమైన వాతావరణం ఒక్కసారిగా భారీ వర్షం కురియడంతో పట్టణంలోని రహదారులన్నీ జలమయమయ్యాయి. సుమారు గంటన్నర పాటు ఏకధాటిగా కురిసిన వాన డ్రైనేజీలు పొంగిపొర్లాయి. వర్షపు నీరు రోడ్లపై ఉధృతంగా ప్రవహించింది. సాయంత్రం ఇళ్లకు చేరుకును ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. గురువారం దీపావళి సందర్భంగా వికారాబాద్ పట్టణంలో రోడ్లపై వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారాలు ఇబ్బందులు పడ్డారు. అమ్మకానికి ఉంచిన దీపంతాలు, టపాకులు తడిసిపోయాయి. పండ్ల, అరటి కాయల చెట్ల వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ వర్షంతో పట్టణంలో గంటపాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. చిగుళ్లపల్లి మైదానంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాల్లో టపాసులు తడిసి మద్దయ్యాయి. రెండు దుకాణాలు కూలిపోయాయి. భారీ నష్టం వాటిల్లినట్లు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే బ్రిడ్జిపై విద్యుత్‌లైట్లు లేకపోవడంతో వాహదారులు ఇబ్బందులు పడ్డారు. మట్టి రోడ్డు బురదమయంగా మారండంతో వాహనదారులు కిందపడిపోయారు. వర్షానికి జిల్లా కోర్టు ఎదుట రోడ్డు చెట్టు కూలిపోయింది. కాగా బంట్వారం, కోట్‌పల్లిలో మోస్తరు వాన కురియగా, పరిగిలో ఉరుములు మెరుపులతో కూడిన చిరుజల్లులు కురిశాయి.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

పరిగి,అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఎంఈవో గోపాల్ బుధవారం యాభాజీగూడ పాఠశాలను తనిఖీ చేశారు. ఎస్ఏ-1 పరీక్షల ప్రశ్నాపత్రాలు ఇంకా కరెక్షన్ చేయకపోవడాన్ని గుర్తించారు. పరీక్షలు పూర్తయి ఐదారు రోజులైనా ఎందుకు అప్‌డేట్ చేయలేదని ప్రశ్నించారు. విద్యార్థుల్లో నైపుణ్యతను పెంపొందించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్

వికారాబాద్/పరిగి, అక్టోబరు 30, (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన పది నెలల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ అన్నారు. బుధవారం ఆయన నివాసంలో రూ.18,500 కోట్ల విద్యుత్ భారాన్ని ఆపడంలో విజయం సాధించినందుకు కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కరెంట్ చార్జీలు పెంచేందుకు చేసిన ప్రయతాన్ని విజయవంతంగా తిప్పికొట్టామన్నారు. అలాగే


కేసీఆర్‌చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆనంద్

పరిగిలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు బాణసంచా పేల్చి, కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.













ఓటరు జాబితాపై నేతలతో సమావేశం

కొడంగల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాపై బుధవారం కొడంగల్ తహసీల్దార్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే నవంబరు 28లోపు తెలియజేయాలన్నారు. జాబితా కోసం నవంబరు 9, 10వ తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. 18ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, వివిధ రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు భారీ స్పందన : ఎంపీ

కులకచర్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదుకు మంచి స్పందన వస్తోందని చేవేళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం కులకచర్లలో మండల అధ్యక్షుడు సూర్యకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదులో ఎంపీ పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 60లక్షల మంది సభ్యత్వం తీసుకున్నట్లు తెలిపారు. చేవేళ్ల లోక్‌సభ స్థానం రాష్ట్రంలో సభ్యత్వ నమోదులో రెండో స్థానంలో ఉందన్నారు. నాయకులు కె.ప్రహ్లాద్‌రావు,పరమేశ్వర్ రెడ్డి, మారుతికిరణ్, వెంకటయ్యగౌడ్, సౌమ్యారెడ్డి పాల్గొన్నారు.

భూగర్భ జల సంరక్షణపై దృష్టి సారించాలి

వికారాబాద్, అక్టోబర్ 30(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు కోసం భూగర్భ జలాల సంరక్షణపై దృష్టి సారించాలని జిల్లా భూగర్భ జల శాఖ అధికారి రవిశంకర్ అన్నారు. బుధవారం కొత్తగడి పాఠశాలలో సీడ్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలో భూగర్భ జలాలు పెంపునకు రైతులు పొలాల్లో నీటి కుంటలు నిర్మించుకోవాలన్నారు. బిందు సేద్యం పద్ధతులను పాటించాలని తెలిపారు. రైతులు భూగర్భ జలశాఖను సంప్రదిస్తే బోర్‌వెల్ పాయింట్ కోసం సర్వే చేసిస్తామని తెలిపారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నాగబ్రహ్మాచారి మాట్లాడుతూ విద్యార్థుల ద్వారా తల్లిదండ్రులకు, రైతులకు భూగర్భ సంరక్షణపై అవగాహన కల్పించడమే తమ ఉద్దేశమన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్ర లేఖన పోటీలు నిర్వహించారు. హైడ్రో జియోలాజిస్ట్ వజియుద్దీన్, డాక్టర్ కె.భాగ్య, సరిత, వీరకాంతం, దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.



















అప్రమత్తతోనే మోసాలకు చెక్

శామీర్‌పేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):వినియోగదారులు బ్యాంక్ అకౌంట్లలో ఉన్న డబ్బుల పట్ల అప్రమత్తంగా ఉంటనే ఆన్‌లైన్‌లో మోసాలను అరికట్టొచ్చని కెనరా బ్యాంక్ విజిలెన్స్ రీజినల్ సౌత్ ఆఫీస్ సీనియర్ మేనేజర్ గోవింద్‌కుమార్ ఝా తెలిపారు. బుధవారం శామీర్‌పేటలోని జడ్పీ పాఠశాలలో విజిలెన్స్ అవేర్నెస్ వీక్-2024 కార్యక్రమాన్ని స్థానిక కెనరా బ్యాంక్ మేనేజర్ సాగర్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద్‌కుమార్, కెనరా బ్యాంక్ శామీర్‌పేట బ్రాంచ్ మేనేజర్ సాగర్ ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జాగ్రత్తలు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలను నిర్వహించి ప్రశంశా పత్రాలు, బహుమతులను అందజేశారు. హెచ్ఎం వేణు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు ప్రశంసాపత్రాల అందజేత



మహిళల పట్ల అనుచితంగా వ్యవహరిస్తే
షీ టీంకు ఫోన్ చేయండి

పెద్దేముల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మహిళల పట్ల ఎవరైన అనుచితంగా వ్యవహరించినా, వెకిలి చేష్టలు చేసినా వెంటనే షీ టీంకు ఫోన్‌చేయాలని షీ టీం సబ్ డివిజన్ ఇన్‌చార్జి శేఖర్ అన్నారు. పెద్దేముల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు, యువతులు, విద్యార్థినుల పట్ల ఎవరైనా అనుచితంగా, అసభ్యకరంగా ప్రవర్తిస్తే షీ టీంకు సమాచారమిస్తే చర్యలు తీసు కుంటామన్నారు.



డ్రోన్ సర్వేను పరిశీలించిన చైర్‌పర్సన్

తాండూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీలో రెండో రోజు కొనసాగిన డ్రోన్ సర్వేను మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న బుధవారం పరిశీలించారు. 2050 మాస్టర్ ప్లాన్‌లో భాగంగా చేపడుతున్న డ్రోన్ సర్వే ఎలా చేస్తున్నారు? ఏం గుర్తిస్తున్నారనే వివరాలను సర్వే ఆఫ్ ఇండియా ప్రతినిధి వరప్రసాద్, గోపాల్‌లను అడిగి తెలుసుకున్నారు. రెండు కిలోమీటర్ల ఒక కంట్రోల్ పాయింట్ ఏర్పాటు చేస్తున్నామని ఇప్పటి 30పాయింట్లు గుర్తించామని వరప్రసాద్ వివరించారు. వారం రోజుల పాటు సర్వే కొనసాగుతుందన్నారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా సర్వే చేస్తున్నట్లు తెలిపారు.







సర్వే వివరాలను తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ స్వప్న







ప్రభుత్వ పథకాలు

పేదలకందేలా కుటుంబ సర్వే


వికారాబాద్ : మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్/తాండూరు రూరల్/కొడంగల్/మోమిన్‌పేట్/పరిగి/దోమ/నవాబుపేట/బొంరాస్‌పేట్/కీసర రూరల్/తాండూరు/దౌల్తాబాద్/శామీర్‌పేట, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు పేద ప్రజలకు అందేలా సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిస్తామని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్లు సుధీర్, లింగ్యానాయక్ అన్నారు. బుధవారం వికారాబాద్ కలెక్టరేట్, కొడంగల్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో ఎన్యుమరేటర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. సర్వే విధివిధానాలపై వివరించారు. చేయాలన్నారు. మోమిన్‌పేట్‌లో ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ సర్వే పకడ్బందీగా చేపట్టాలన్నారు. తాండూరు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన శిక్షణలో సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ మాట్లాడారు. ప్రతీ ఎన్యుమరేటర్ 150 ఇళ్ల సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. బీసీ కుల గణన పకడ్బందీగా చేయాలని వికారాబాద్ ఆర్డీవో ఎం.వాసుచంద్ర అన్నారు. పరిగి మండల పరిషత్‌లో ఎన్యుమరేటర్లకు అవగాహన కల్పించారు. డీఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ ఆనంద్‌రావు, ఎంపీడీవో కరీం, మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య పాల్గొన్నారు. దోమ మండల ప్రత్యేకాధికారి హనుమంతరావు, ఎంపీడీవో మహేశ్‌బాబు సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. నవాబుపేట ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేకాధికారి గోపాల్ అవగాహన కల్పించారు. ఎంపీవో విజయ్‌కుమార్, ఏపీవో లక్ష్మీదేవి పాల్గొన్నారు. కులగణన సర్వేపై బొంరాస్‌పేట్ ప్రత్యేకాధికారి రాంరెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణిచ్చారు. ఎంపీడీవో వెంకన్నగౌడ్, ఎంఈవో హరిలాల్, ఎంపీవో మహేశ్‌కుమార్, ఆర్ఐ శిరీష పాల్గొన్నారు. కుటుంబ సర్వేను పకబ్బందీగా నిర్వహించాలని నాగారం మున్సిపల్ కమిషనర్ ఎస్.భాస్కర్‌రెడ్డి అన్నారు. స్టార్ ఫంక్షన్ హాల్లో ఎన్యుమరేటర్లకు అవగాహన కల్పించారు. మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, డీఈఈ సుదర్శనం రఘు పాల్గొన్నారు. తాండూరు మున్సిపల్ కార్యాలయ మీటింగ్ హాల్లో మాస్టర్ ట్రైనర్, టీచర్ భానుప్రకాష్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ విక్రమసింహారెడ్డి, మేనేజర్ నరేందర్‌రెడ్డి, టీఎంసీ రాజేంద్రప్రసాద్, ఏఈ ఖాజాహుస్సేన్, మెప్మాకో-ఆర్డినేటర్ విశాల ఉన్నారు. దౌల్తాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు, ఆశాలకు శిక్షణ నిర్వహించారు. నవంబరు 6 నుంచి ప్రారంభమయ్యే సర్వేలో అన్ని కుటుంబాల సమగ్ర వివరాలను సేకరించాలని సూచించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు. ఎన్యునరేటర్లు సర్వేను తప్పులు లేకుండా చేయాలని శామీర్‌పేట ఎంపీడీఓ మమతబాయి సూచించారు. మండల పరిషత్‌లో ఎంపీఎస్ఓ రవీందర్, ఎంపీవోల వినూత్నలతో కలిసి శిక్షణ ఇచ్చారు.


శామీర్‌పేట: మండల పరిషత్‌లో ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇస్తున్న అధికారులు







రాక్ కట్టింగ్ బ్లేడ్ తగిలి యువకుడికి గాయాలు

కీసర, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాళ్లు కోసే బ్లేడ్ తగిలి యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం కీసరలో జరిగింది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. కీసరకు చెందిన మంజుల రమేష్(38) రాళ్లు కొట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పనిచేస్తుండగా రాళ్ల కటింగ్ మిషన్ బ్లేడ్ ఊడి రమేష్ ఛాతీకి తాకింది. శరీరం లోతుగా కట్టయింది. చేతికీ గాయమైంది. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ పైలట్ రవి అక్కడికి చేరుకున్నాడు. రమేశ్‌కు రక్తస్రావాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటూ, ఆక్సిజన్‌ను అందిస్తూ రమేశ్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించాడు. క్షతగాత్రుడు ప్రస్తుతం చికిత్స పొందుతున్నట్టు రవి తెలిపాడు.

ఘనంగా మైలారం మల్లన్న బోనాలు

మర్పల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):మండలంలోని బూచన్‌పల్లి గ్రామంలో మైలారం మల్లన్న బోనాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో మల్లన్న బోనాల ఉత్సవాలను నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, పోతురాజు విన్యాసాల మధ్య మహిళలు బోనాలతో మల్లన్న ఆలయానికి వెళ్లి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. గుడిచుట్టు ప్రదక్షిణలు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, భారీగా గ్రామస్తులు పాల్గొన్నారు.


బూచన్‌పల్లిలో బోనాలతో ఆలయానికి తరలుతున్న గ్రామస్తులు

హత్య జరిగిన తీరుపై రీ కన్‌స్ట్రక్షన్

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన నిందితులను కర్ణాటక పోలీసులు బుధవారం హత్యా ప్రదేశానికి తీసుకొచ్చారు. ఘట్‌కేసర్ మండలం హెచ్‌పీసీఎల్ సంస్థ సమీపంలోని సర్వీసు రోడ్డులో సీన్ రీ కన్‌స్ట్రక్ట్ చేశారు. కర్ణాటకకు చెందిన రమేష్‌కుమార్(52)ను ఈ నెల 4న అతడి భార్య నిహారిక, ఆమె ప్రియుడు రాణా భువనగిరిలో దింపేందుకని కారులో వెళ్తూ రమేష్ మెడకు వైర్ బిగించి చంపారు. మృతదేహాన్ని కారు డిక్కీలో వేసుకొని కర్ణాటకలోని సుంటికుప్ప గ్రామంలో ఓ కాఫీ తోటలో వేసి నిప్పుపెట్టారు. స్థానికుల సమాచారంతో అక్కడి పోలీసులు సగం కాలిన మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు. నిందితులు నిహారిక(29), రాణా, సహకరించిన నిఖిల్‌రెడ్డిలను అరెస్టు చేశారు. నిహారిక, రాణాలను ఘట్‌కేసర్ తీసుకొచ్చి హత్య తీరుపై తెలుసుకున్నారు.కర్ణాటక పోలీసుల వెంట పోచారం ఐటీసీ సీఐ రాజువర్మ, సీఐ పరశురాం, ఎస్సైలు నాగార్జున్‌రెడ్డి, శ్రీకాంత్ ఉన్నారు.



